

జమ కాని వడ్డీ రాయితీ

మహిళా సంఘాలకు వడ్డీ రాయితీని అకౌంట్లలో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటికీ హామీ నెరవేరలేదు.

- 8లో ▸



రెండోరోజూ క్యాంపస్ వెలవెల

వేసవి సెలవులు రద్దు చేసి తెయూ వర్సిటీని తిరిగి ప్రారంభించినప్పటికీ విద్యార్థులు ఎవరూ క్యాంపస్‌కు రావట్లేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.7 /27.7

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

పారిశుధ్య కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి



సుభాష్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం వర్షాకాలం ప్రారంభం కాక ముందు గ్రామాల్లో చేపడుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం మండలకేంద్రంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలు, డంపింగ్ యార్డులను తనిఖీ చేశారు. మూడో రోజు డ్రై డే కారణంగా ఇంటింటికీ తిరిగి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈనెల 23 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఎంపీవో ఇక్బాల్, డీపీవో కార్యాలయ అధికా రి రాజబాబు, పంచాయతీ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి, ఆశావర్కర్లు, సిబ్బంది ఉన్నారు.

యూనివర్సిటీని ప్రక్షాళన చేయాలి



నిజామాబాద్ అర్బన్ : తెలంగాణ యూనివర్సిటీని అవినీతి నుంచి ప్రక్షాళన చేసి అభివృద్ధి చేయాలని శుక్రవారం ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. యున్నివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిసంఘాల నాయకులు మాట్లాడుతూ వర్సిటీలో రిజిస్ట్రార్ పదవి కొట్లాటతో వర్సిటీ పరువు తీస్తున్నారని, విద్యార్థి సమస్యలను గాలికి వదిలేశారని, విద్యార్థులు ఫీజుల రూపంలో కట్టిన రూ. కోట్లు వీసీ విచ్చలవిడిగా ఖర్చు చేశారని ఆరోపించారు. జిల్లా ప్రజాప్రతినిధులు కూడా స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వర్సిటీ పరిరక్షణ సమితిగా ఏర్పాటు చేస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వేణు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, రఘురాం, అనిల్, గణేశ్, సాయిరెడ్డి, సాయికృష్ణ, కిరణ్, యూసుఫ్ మనోజ్, స్నేహిత తదితరులున్నారు.

విధివంచితులకు చేయూతనిద్దాం

- ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్



నిజామాబాద్‌నాగారం : మతిస్థిమితం లేక రోడ్లపై తిరుగుతున్న అనాథలకు చేయూతనిద్దామని అలాంటి వారి వివరాలు ఇందూరు యువత స్వచ్ఛంద సేవాసంస్థకు తెలపాలని ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఇందూరు యువత సేవాసంస్థ ఆధ్వర్యంలో 'మానవత్వంతో ఆలోచిద్దాం' అనే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. శుక్రవారం సీపీ చాంబర్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. రోడ్ల పక్కన మతిస్థిమితం లేకుండా ఉన్న అనాథల వివరాలను 8897 213286కి తెలియజేయాలన్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో ఇంచార్జ్ అడిషనల్ (డీసీపీ) అడ్మిన్ ఎ మధుసూదన్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్ కమాండెంట్ గిరి రాజు, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, గౌరవ అధ్యక్షులు దారం గంగాధర్ తదితరులున్నారు.

పరిహారం వచ్చేసింది..

మోర్తాడ్/డొంకేశ్వర్ : అకాల వర్షాలతో జరిగిన పంట నష్టానికి సంబంధించిన పరిహారం ఎట్టకేలకు రైతుల ఖాతాల్లో జమైంది. గడచిన మార్చిలో కురిసిన వర్షాల వల్ల జిల్లాలో 467.35 ఎకరాల్లో 371 మంది రైతులకు సంబంధించిన పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక పంపించింది. ఇందుకు సంబంధించిన రూ. 46.73 లక్షలు బాధిత రైతుల ఖాతాల్లో గురువారం ఖాతాల్లో పడినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఆర్.తిరుమల ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో కూడా దాదాపు 30 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నష్టానికి సంబంధించి పరిహారం కోసం వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికను పంపించింది.

బ్లాక్‌మనీ బయటకు..



- రూ.2 వేల నోట్లను రద్దు చేస్తూ ఆర్బీఐ సంచలన నిర్ణయం
- స్వాగతిస్తున్న సామాన్య, మధ్య, పేద తరగతి ప్రజలు
- దాచుకున్న బడాబాబుల్లో ఆందోళన
- సెప్టెంబర్ 30 వరకు బ్యాంకుల్లో మార్చుకునే అవకాశం

ఖలీల్‌వాడి : రూ. 2 వేల నోట్లను రద్దుచేస్తూ ఆర్బీఐ తీసుకున్న సంచలన నిర్ణయాన్ని మధ్య తరగతి, సామాన్య, పేద వర్గాలు స్వాగతిస్తున్నాయి. చిరు వ్యాపారులూ మద్దతు పలుకుతున్నారు. పెద్ద నోట్ల రద్దుతో బ్లాక్ మనీ బయటకు వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రూ. రెండు వేల నోట్లను ఇక నుంచి మార్కెట్‌లో చెలామణిలో ఉంచొద్దని అన్ని బ్యాంకులకు ఆర్‌బీఐ శుక్రవారం ఆర్బీఐ ఆదేశాలు జారీ చేసింది. కాగా ఈ నోట్లను మార్చుకునేందుకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. ఈ నెల 23 నుంచి సెప్టెంబర్ 30 వరకు అన్ని బ్యాంకులతో పాటు ఆర్‌బీఐ రీజినల్ బ్యాంకుల్లో మార్చుకోవచ్చు. గత రెండేళ్లుగా రూ.2 వేల నోట్లు మార్కెట్‌లో అందుబాటులో లేవు. ఈ నోట్లను బడా వ్యాపార వేత్తలు, రాజకీయ నాయకులు బ్లాక్ మనీగా నిల్వచేసుకున్నారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు రూ. రెండు వేల నోట్లను దాచుకున్నవారిలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. పెద్ద సంఖ్యలో నోట్లు ఉన్న వారు వాటిని ఎలా మార్చుకోవాలన్నదానిపై కొంత ఆందోళనలో ఉన్నారు.

కర్ణాటక తీర్పును పక్కదారి పట్టించడానికే..



కర్ణాటక తీర్పును పక్కదారి పట్టించడానికే మోదీ ప్రభుత్వం రూ.2 వేల నోట్లను రద్దు చేసింది. కాంగ్రెస్ పార్టీకి కర్ణాటక ప్రజలు పట్టం కట్టడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోంది. గత రెండేళ్లుగా ఈ నోట్లు చలామణిలో లేవు. బడా వ్యాపార వేత్తలు, పారిశ్రామిక వేత్తల మధ్యనే నోట్లు ఉన్నాయి. సామాన్యుల వద్ద రెండు వేల నోట్లు లేవు.

– మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

కూలీలకు అందుబాటులో ఉండవు



చిరు వ్యాపారం చేసే వారికి ప్రతి రోజు రూ.500 కంటే మిగులుబాటు లేదు. రూ. రెండు వేల నోట్లు మార్కెట్‌లో లేక చాలా రోజులవుతుంది. ఇవి రాజకీయనాయకులు, బడా వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్దే ఎక్కువ మొత్తంలో నిల్వ ఉన్నాయి. సామాన్యుల చేతికి రూ 2 వేల నోటు వచ్చే పరిస్థితి ఈరోజుల్లో లేదు.

– శంకర్, చిరువ్యాపారి

నకిలీ నోట్ల బెడద తప్పుతుంది..



నోట్ల రద్దు నిర్ణయం మంచిదే. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు , పారిశ్రామిక వేత్తలు ఈ నోట్లను బ్లాక్ మనీగా ఉంచుకున్నారు. రద్దుతో బ్లాక్‌మనీ బయటకు వస్తుంది. ప్రభుత్వానికి ఆదాయం చేకూరి సామాన్యులకు లబ్ధిచేకూరే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో నకిలీ నోట్ల బెడద సామాన్యులకు తప్పుతుంది.

– చంద్రమోహన్‌చారి, ఆర్ఎంపీ, సిర్‌పూర్

ప్రస్తుతం మార్కెట్లో లేవు..



నోట్ల రద్దుతో నల్లధనం బయటకు వస్తుంది. ఆర్‌బీఐ డిపాజిట్‌ను రూ. 20 వేలకు పరిమితి చేసింది. ప్రస్తుతం రూ.2 వేల నోట్లు మార్కెట్‌లో అందుబాటులో లేవు.

– శ్రీకాంత్, మోపాల్

మంచి నిర్ణయమే..



రెండు వేల నోట్ల రద్దుతో బడా వ్యాపారవేత్తలు, రాజకీయ నేతల వద్ద నిలువ చేసుకున్న బ్లాక్ మనీ బయటకు వస్తుంది. రద్దు మంచి నిర్ణయమే.దీనిని అందరూ స్వాగ తించాలి.

– బి.దేవేందర్- మెడికల్‌షాపు నిర్వాహకుడు

నోట్ల రద్దును స్వాగతిస్తున్నాం



రూ. రెండు వేల నోట్ల రద్దును స్వాగతిస్తాం. ఈ నోట్లు బ్లాక్‌మార్కెట్‌కు వెళ్లడంతో రెండేళ్లుగా అందుబాటులో లేవు. నోట్ల రద్దుతో బ్లాక్‌మనీ బయటకొస్తుంది.

– ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

గాంధీ విగ్రహం సాక్షిగా..
జాతీయ జెండాకు అవమానం

- జాతీయ జెండాను తగలబెట్టేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అడ్డుకున్న యువకులు
- సుమోటోగా కేసు నమోదు
- పోలీసుల అదుపులో నిందితుడు



వాజిద్ అలీ నుంచి జాతీయ జెండాను లాక్కుంటున్న యువకుడు

ఖలీల్‌వాడి : గాంధీ విగ్రహం సాక్షిగా జాతీయ జెండాకు నిప్పు పెట్టేందుకు ప్రయత్నించిన వ్యక్తిని కొందరు యువకులు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎప్పుడు రద్దీగా ఉండే గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహం గద్దె పైకి ఎక్కి నగరంలోని హైమద్‌పురా కాలనీకి చెందిన వాజీద్ అలీ జాతీయ జెండాను లైటర్‌తో తగలబెడుతుండగా, అక్కడకి వివిధ పనుల నిమిత్తం వచ్చిన యువకులు అడ్డుకున్నారు. జాతీయజెండా కొంతమేరకు కాలిపోయింది. ఇక్కడ ఎప్పుడూ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఈ ఘటన సమయంలో అక్కడ ఎవరూ లేరు. యువకులకు, వాజీద్ అలీకి వాగ్వివాదం చోటుకు చేసుకోవడంతో పోలీసులు అక్కడికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ, హిందూ సంస్థల నాయకులు ఒకటవ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వాజిద్‌అలీ ఇంజనీరింగ్ పూర్తి చేసినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. పోలీసులు వాజిద్‌అలీ మానసిక పరిస్థితి సక్రమంగా లేదని చెబుతున్నారు. కాగా కేసును నీరు గార్చే ప్రయత్నిస్తున్నారని హిందూ సంస్థల నేతలు ఆరోపిస్తున్నారు. సుమోటోగా తీసుకుని వాజిద్‌అలీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వాజిద్ అలీ జాతీయజెండాను తగలబెట్టే సమయంలో ఓ సంస్థకు అనుకూలంగా నినాదాలు చేసినట్లు అక్కడి యువకులు చెబుతున్నారు. దీనిపై సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి విచారించనున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. జాతీయజెండాను అవమానించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారయణ గుప్తా ఎస్‌హెచ్‌వోకు వినతి పత్రం అందజేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో నపూర్‌శర్మ, ఎమ్మెల్యే రాజాసింగ్ ఫ్లెక్సీ ఫొటోలు రోడ్డు పై వేసి చెప్పులతో కొట్టిన వారిపై పోలీసులు ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికే నగరంలో పీఎఫ్ఐ శిక్షణ శిబిరం నిర్వహించిందని, ఇందులో శిక్షణ పొందిన వారిని పోలీసులు పట్టుకోలేదన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం

- కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం నంబర్‌వన్
- బీజేపీని ప్రజలు నమ్మరు..
- మంత్రి వేముల ప్రశాత్‌రెడ్డి



వేల్పూర్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్ : బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం అని, పార్టీకోసం పనిచేసే వారికి ఖచ్చితంగా సముచిత గౌరవం దక్కుతుందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లక్కోర వద్ద ఏఎన్‌జీ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన వేల్పూర్ మండల రెండో క్లస్టర్ గ్రామాల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో నెంబర్‌వన్ అయ్యిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో లేని బండి సంజయ్, దశాబ్ది ఉత్సవాలను కేసీఆర్ కుటుంబ ఉత్సవాలని పేర్కొనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఈ ప్రాంత ఎంపీ వల్ల అభివృద్ధి ఏమీ జరగలేదని, పసుపుబోర్డు పేరుతో రైతులను నిండా ముంచిన బీజేపీని నమ్మే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. కేసీఆర్ సహకారంలో బాల్కొండ నియోజకవర్గాన్ని వేల కోట్లతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామన్నారు. నాడు మీ తండ్రులు మా తండ్రి దివంగత వేముల సురేందర్‌రెడ్డికి తోడుగా ఉన్నారని, వారి కుమారులైన మీరు నేడు నాతో కలసి పనిచేస్తున్నారని ఇది అరుదుగా లభించే గౌరవమన్నారు. ఆయన సతీమణి నీరజారెడ్డితో కలిసి కార్యకర్తలకు భోజనాలు వడ్డించారు. వారితో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, రాష్ట్ర నాయకుడు డాక్టర్ మధుశేఖర్, డీసీసీబీ వైస్‌ఛైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, ఎంపీపీ బీమజమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి, ఏఎంసీ ఛైర్మన్ అరుణ, వైస్‌ఛైర్మన్ నల్లరమేష్, మండల గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బట్టాపూర్ క్వారీలో సర్వే చేపట్టాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు బీజేపీ నేతల ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మల్లికార్జున్ రెడ్డి

సుభాష్‌నగర్ : ఏర్గట్ల మండలం బట్టాపూర్ గ్రామంలో ఏడేళ్లుగా పర్యావరణ అనుమతులు లేకుండా నడుస్తున్న కంకర క్వారీలో అక్రమాలు జరుగుతున్నాయని, దీనిపై ఈటీఎస్ (ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్) సర్వే నిర్వహించాలని బీజేపీ బాల్కొండ నియోజకవర్గ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మైనింగ్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. కంకర క్వారీ లీజ్‌కు తీసుకున్న జియో స్టోన్ ఇండస్ట్రీస్ 10,000 క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకొని ఇప్పటివరకు 12 లక్షల క్యూబిక్ మీటర్లకుపైగా తరలించారన్నారు. పర్యావరణ అనుమతులు కూడా లేవని, క్వారీ స్కాంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. దీనిపై అరునెలల క్రితమే హైదరాబాద్‌లో గనుల శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఈటీఎస్ సర్వే నిర్వహించాలని జిల్లా మైన్స్ ఏడీకి ఆదేశాలు ఇచ్చారన్నారు. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం రూ. 200 కోట్లకు పైగా జరిమానా పడే అవకాశముందన్నారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో నిబంధనలు బేఖాతలు చేస్తూ కంకర రోడ్డు వేశారన్నారు. దీన్ని పరిశీలించేందుకు వచ్చిన అప్పటి రేంజ్ ఆఫీసర్‌ను మంత్రి 24 గంటల్లో బదిలీ చేయించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించాలని లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్,నారాయణరెడ్డి,మహిపాల్ తదితరులున్నారు.

నేడు, రేపు ఐపీఎల్ ప్రత్యక్ష ప్రదర్శన



మాట్లాడుతున్న బీసీసీ రిప్రజెంటెటీవ్ ఇర్ఫాన్

నిజామాబాద్‌నాగారం : టాటా ఐపీఎల్ సహకారంతో జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు, ప్రజలందరికీ ఐపీఎల్ టోర్నీ లీగ్ మ్యాచ్‌ల లైవ్ టెలికాస్ట్ చేయనున్నట్లు బీసీసీఐ రిప్రజెంటెటీవ్ ఇర్ఫాన్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈనెల 20, 21 తేదీల్లో జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్‌లోని ఉమెన్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి లైవ్ ప్రదర్శన సిల్వర్ స్క్రీన్‌పై ఉంటుందన్నారు. ఈనెల 20న ఢిల్లీ క్యాపిటల్ వర్సెస్ చెన్నయ్ సూపర్‌కింగ్ మ్యాచ్ ఉంటుందని, అనంతరం సాయంత్రం 7.30లకు కలకత్తా నైట్ రైడర్స్ వర్సెస్ లక్నో సూపర్స్ మధ్య పోటీ జరుగుతుంది. 21న మధ్యాహ్నం 1.30 ముంబయ్ ఇండియన్స్ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య పోటీ, సాయంత్రం 7.30 గంటలకు రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూర్ వర్సెస్ గుజరాత్ టైటాన్స్ మధ్య పోటీ ఉంటుంది. ఈ అవకాశాన్ని క్రికెట్ అభిమానులందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కోచ్ సురేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిప్రజెంటెటీవ్ ఇర్ఫాన్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు.

దేవుడి భూములకు దిక్కెవరు!

- ఉమ్మడి జిల్లాలో 4,100 ఎకరాల్లో ఆలయ భూములు
- సగానికి పైగా కబ్జాకోరల్లోనే..
- విచారణ చేస్తున్న దేవాదాయ సహాయ కమిషనర్
- లోతుగా విచారిస్తే కబ్జాలు బయటపడే అవకాశం



కబ్జాకు గురైన రాంమందిర్ మఠం స్థలం

నిజామాబాద్ సిటీ : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆలయాల భూములకు రక్షణ కరువైంది. ఈ భూములను పరిరక్షించేవారు లేకపోవటంతో కబ్జారాయుళ్ల వాటిపై పడ్డాయి. దీంతో ఎక్కడికక్కడ విలువైన ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఈ కబ్జాలపై ఫిర్యాదు అందితే తప్ప అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల బడారామందిర్‌కు చెందిన భూముల విషయంలో కోర్టులో విచారణ జరుగుతుండగా దాంట్లో భాగంగా గురువారం జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ నగరంలోని బడారాంమందిర్ మఠంలో విచారణ చేశారు. అయితే ఈ విచారణలో అక్కడి సిబ్బంది సహకరించలేదని సమాచారం.


రాంమందిర్ మఠం భూములు కబ్జా..

నగరంలోని బడా రాంమందిర్(మఠల్)కు చెందిన భూములు మొత్తంగా 480 ఎకరాల 6 గుంటలు ఉండగా ఇందులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 213 ఎకరాల 10 గుంటలు, ఆదిలాబాద్ జిల్లాలో 149 ఎకరాల 32 గుంటలు, నాందేడ్(మహారాష్ట్ర)లో 117 ఎకరాల 4 గుంటలు భూములు ఉన్నాయి. కాగా నిజామాబాద్‌లో సర్వేనం.1,757లో ఒక ఎకరం 35 గుంటల భూమిను మఠల్ పీఠాధిపతి దినకర్ స్వామి రూ. 1.43 కోట్లకు విక్రయించి అడ్వాన్స్‌గా రూ. 63 లక్షలు తీసుకున్నట్లు దేవాదాయ శాఖకు ఫిర్యాదు అందింది. స్థలం కొనుగోలు చేసిన సదరు వ్యక్తి ఆ స్థలం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లగా రిజిస్ట్రేషన్ కాలేదు. దాంతో అతను జిల్లా దేవాదాయ శాఖపై హైకోర్టులో కేసు వేశారు. గత ఆరునెలలుగా ఈ కేసు నడుస్తోంది.

2018లోనే ఆలయ భూములపై ఫిర్యాదు

2018లో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సువర్ణ అనే మహిళ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మఠాలకు చెందిన భూములు కబ్జాలకు గురైవుతున్నాయని, వాటిని కాపాడాలని లోకాయుక్తలో కేసు వేశారు. దాంతో రాష్ట్ర దేవాదాయ శాఖ యంత్రాంగం కదిలింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఆలయాలకు చెందిన భూములు ఎన్ని ఉన్నాయి. కబ్జాలకు గురైన భూములు ఎంత వాటిలెక్క తేల్చాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంత్ జిల్లా దేవాదాయ సహాయ కమిషనర్‌ను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఆలయాలకు సంబంధించి రికార్డుల ప్రకారం 4,100 ఎకరాలు భూములు ఉండగా, ఇందులో దాదాపు 500 ఎకరాలు కౌలుకు ఇచ్చారు. మిగితా భూముల్లో ఎన్ని ఎకరాలు కబ్జాలకు గురయ్యాయో సర్వేచేస్తే గాని తెలియకుండా ఉంది. ఇందులో అనేక ఎకరాలు ఎప్పుడో కబ్జాలకు గురయ్యాయని సమాచారం.

విచారణ చేస్తున్నాం



బడారాంమందిర్(మఠం) చెందిన కబ్జా స్థలంపై విచారణ జరుపుతున్నాం. మఠల్ పీఠాధిపతి దినకర్ స్వామి ఈ స్థలం విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి. కానీ స్వామికి మఠల్‌కు చెందిన స్థలం విక్రయించే అవసరం లేదు. ఎందుకంటే అతనికి నా అనే వారు ఎవరూ లేరు. స్వామి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఉంటారనే అనుమానం ఉంది. దీనిపై తాము కూడా కోర్టులో కేసు వేశాం. ప్రస్తుతం స్వామి ఏమి మాట్లాడలేని, కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమయ్యారు. కంఠేశ్వర్ ఆలయానికి చెందిన సర్వేనం. 1959లో 9 గుంటల భూముల్లో దాదాపు 12 మంది కబ్జాలకు పాల్పడ్డారు. వారికి నోటీసులు ఇచ్చాం. జూన్ 15 వరకు వారిపై కేసులు ఫైల్ చేయబోతున్నాం.

– ఎస్ సుప్రియ,దేవాదాయ సహాయక కమిషనర్

క్లుప్తంగా

బీజేపీలో చేరిన జంలం సర్పంచ్



ఎడపల్లి: బీజేపీ బోధన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీ అర్వింద్ సమక్షంలో మండలంలోని జంలం సర్పంచ్ గౌడుగు రాజ్యలక్ష్మి, హన్మంతు బీజేపీలో చేరారు. మోపల కమలాకర్‌రెడ్డి, ఉప్పు సురేష్, పోచారం సర్పంచ్ ఇంద్రకరణ్,జానకంపేట సర్పంచ్ పాట్టోల సాయిలు, జాక్కు శ్రీకాంత్ పాల్గొన్నారు.

నియామకం



బోధన్‌టౌన్: జాతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా చైర్మన్‌గా దమ్మల్ల జ్యోతిరాజ్ నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని జాతీయ హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో శుక్రవారం నియామక పత్రాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. జిల్లా ప్రెసిండెంట్‌గా వై చార్లెస్ వెస్లీ నియామకం అయ్యారు. కార్యక్రమంలో డైరెక్టర్ మహేష్ గోపాల్, ప్రతినిధులు ఆనంద్, సుభాషి, నరేష్ ఉన్నారు.

మహారాష్ట్ర మద్యం విక్రయిస్తే కేసులు



రెంజల్: మహారాష్ట్ర మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై సాయన్న హెచ్చరించారు. శుక్రవారం సాటాపూర్‌లో గల మద్యం దుకాణంతో పాటు మండలంలోని పలు బెల్టు షాపులను తనిఖీ చేశారు. మహారాష్ట్ర మద్యం విక్రయించవద్దని నిర్వాహకులకు సూచించారు. తక్కువ ధరకు లభించడంతో పలువురు సరిహద్దున గల మహారాష్ట్ర నుంచి మద్యం తీసుకవస్తున్నట్లు పేర్కొన్నారు.

గొర్రెలు పంపిణీ చేయాలని వినతి



సుభాష్‌నగర్: జిల్లాలోని కురుమ, యాదవులకు రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలని జిల్లా కురుమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గొర్రెలు పంపిణీ చేస్తామంటే 5 ఏళ్ల క్రితం డీడీలు చెల్లించామన్నారు. ఇప్పటి వరకు గొర్రెలను పంపిణీ చేయలేదన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రెండో విడత గొర్రెల పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. హంగర్గ ఈరుగొండ, మేత్రి రాజు, మోహన్, సాయిలు, గంగాధర్, గణేష్ పాల్గొన్నారు.

జమ కాని వడ్డీ రాయితీ

- మహిళా సంఘాలకు వడ్డీ వాపస్ ఇస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం
- రెండున్నర నెలలు గడచినా ఖాతాల్లో జమకాని సొమ్ము



మహిళా సమాఖ్య సమావేశానికి హాజరైన మహిళలు(ఫైల్)

మోర్తాడ్: మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ రాయితీని విడుదల చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం మొండిచేయి చూపింది. ఏళ్ల తరబడి బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి వడ్డీని వాపసు చేయని ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లోకానికి శుభవార్త చెబుతున్నట్లు వెల్లడించింది. జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు రూ.72 కోట్లు వడ్డీ రాయితీని విడుదల చేస్తున్నట్లు ప్రొసిడింగ్‌లను ఇచ్చినా మహిళా ఖాతాల్లో ఇప్పటి వరకు నయా పైసా జమ కాలేదు. జనవరి 2019 నుంచి మార్చి 2022 వరకు 15 నెలలకు సంబంధించిన బ్యాంకు లింకేజీ రుణాల వడ్డీ రాయితీని వాపసు చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. 2018లో ముందస్తు ఎన్నికలకు ముందుగా వడ్డీ రాయితీ సొమ్మును విడుదల చేశారు. ఆ తరువాత ఎప్పటికప్పుడు వడ్డీ రాయితీ సొమ్మును అందిస్తామని వెల్లడించినా నిధుల కొరత కారణంగా సాధ్యం కాలేదు. బ్యాంకుల నుంచి రుణాలు పొందిన మహిళలు క్రమం తప్పకుండా వడ్డీ, అసలు చెల్లిస్తే వడ్డీ సొమ్మును ప్రభుత్వం రీ ఎంబర్స్‌మెంట్ రూపంలో జమ చేస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఒక ఆర్థిక సంవత్సరంలోని రాయితీ సొమ్ము మరో ఆర్థిక సంవత్సరంలో మహిళల ఖాతాలకు జమ చేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వడ్డీ రాయితీ జమ చేయడం పట్టాలు తప్పిందనే అభిప్రాయం వ్యక్తమైతుంది. 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు మహిళా సంఘాలకు రూ.200 కోట్ల వరకు సొమ్ము జమ కావాల్సి ఉంది. కొన్ని నెలల వడ్డీని విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆ సొమ్ము కూడా రెండున్నర నెలలు గడుస్తున్నా మహిళల ఖాతాలకు చేరకపోవడంపై అసంతృప్తి వ్యక్తమైతుంది. ఇది ఇలా ఉండగా ఉప ఎన్నికలను నిర్వహించిన చోట మహిళలకు బకాయి లేకుండా వడ్డీ రాయితీ సొమ్ము జమ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఉప ఎన్నికలతో సంబంధం లేని జిల్లాల్లోనే మహిళలకు అన్యాయం జరిగిందనే వాదన వినిపిస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జారీ చేసిన ప్రొసీడింగ్‌లకు సంబంధించి వడ్డీ రాయితీని వెంటనే చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

మా దృష్టికి వచ్చింది

మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ సొమ్ము జమ కాలేదని మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రొసిడింగ్‌లను మహిళా సంఘాలకు అందించాం. నిధులు విడుదల చేయగానే మహిళల ఖాతాల్లో వడ్డీ సొమ్ము జమ అవుతుంది.

– చందర్‌నాయక్, డీఆర్‌డీవో

'పర్సంటేజీ పనులపైనే ధ్యాస'



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

మోర్తాడ్: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పర్సంటేజీ వచ్చే పనులపైనే ధ్యాస ఉందని, ప్రజల సంక్షేమం కోసం చేపట్టాల్సిన పనులపై శ్రద్ధ లేదని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆరోపించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర కొనసాగింపులో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని వడ్యాట్‌లో పర్యటించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గంలో ఇప్పుడు జరుగుతున్న పనులను పరిశీలిస్తే మంత్రికి ఆయన కుటుంబానికి ఆదాయం తెచ్చిపెట్టే పనులే ఉన్నాయన్నారు. బీడీ కార్మికులకు పీఎఫ్ కటాఫ్ తేదిని ప్రభుత్వం ఎత్తివేసినా పింఛన్ దరఖాస్తులను స్వీకరించడం లేదన్నారు. వడ్యాట్‌లో ఇప్పటి వరకు ఒక్కరికి కూడా డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. రోడ్లు, వంతెనల నిర్మాణంతో సొంత ఆదాయం వస్తుందని అందుకే వాటిపైనే మంత్రి దృష్టి సారించారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల రాములు, తీగెల సంతోష్, రొక్కం మురళి, బద్దం రాజశేఖర్, బూత్‌పురం మహిపాల్, పుప్పాల అశోక్, సుధీర్, గడ్డం మహిపాల్, గంగాధర్, రంజిత్, రవి, దేవేందర్, కిశోర్, నర్సయ్య, దిలీప్, భూమేశ్వర్ పాల్గొన్నారు.

తాగి వేధిస్తున్నాడని తండ్రిపై చిన్నారి ఫిర్యాదు



పోలీసులకు తండ్రిపై ఫిర్యాదు చేస్తున్న ఆరేళ్ల చిన్నారి

నస్రుల్లాబాద్ (బీర్కూర్): తన తండ్రి రోజూ తాగి వచ్చి తనను, తల్లిని కొడుతున్నాడని ఆరేళ్ల చిన్నారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన లతీఫ్, ఇర్ఫానా దంపతులకు ముగ్గురు కూతుర్లు. ఇద్దరి పెళ్లిళ్లు అయిపోయాయి. చిన్న కూతురు ఫాతిమాతో దంపతులు ఉంటున్నారు. అయితే తాగుడుకు బానిసైన తన తండ్రి ఈ మధ్య కాలం నుచి తన తల్లిని, తనను వేధింపులకు గురిచేస్తున్నట్లు బీర్కూర్ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ నందకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు లతీఫ్‌ను పిలిపించి గ్రామ పెద్దల సమక్షంలో భార్య పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.కాగా ఫిర్యాదు చేయడానికి వచ్చిన చిన్నారి వెంట ఆమె తల్లి ఇర్ఫానా ఉందని పోలీసులు తెలిపారు.

ఆడిట్ అధికారుల సర్వే



నిజామాబాద్‌నాగారం:నగరంలోని పలు ప్రాంతాల్లో ఆడిట్ అధికారులు శుక్రవారం సర్వే చేపట్టారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజల స్థితిగతులపై సర్వే చేశారు. అలాగే నగరంలో జరిగిన అభివృద్ధి, జరుగుతున్న పనులను పరిశీలించారు. మరో వారం పాటు సర్వే చేయనున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు జిల్లాస్థాయిలో సీనియర్ పురుషులు, మహిళా క్రీడాకారులను ఎంపిక చేశారు. దాదాపు 50 మంది ఎంపికల్లో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25, 26 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్‌లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్ శ్రీనివాస్, హన్మంతురెడ్డి, ఆంజనేయులు, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

ఆర్ నరేష్, సిహెచ్ సంతోష్, బి స్వామి, డి శివ కుమార్,కె అనిల్,పి నవీన్,కె నాగరాజు కె ప్రతాప్‌సింగ్, ఎస్ వర్ష, కె స్పందన ఎంపికయ్యారు.

పరీక్ష ఫీజు చెల్లించండి

నిజామాబాద్‌అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీ ఆరో సెమీస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలని కో ఆర్డినేటర్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో పరీక్ష ఫీజును చెల్లించాలని సూచించారు.

రెండో రోజూ క్యాంపస్ వెలవెల

హాజరు కాని విద్యార్థులు



తెయూ తెలుగు విభాగంలో అధ్యాపకులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ శుక్రవారం రెండోరోజూ అధ్యాపకులు, విద్యార్థులు లేక వెలవెలబోయింది. వీసీ రవీందర్ ఈ నెలాఖరు వరకు ఉన్న వేసవి సెలవులను రద్దు చేసి ఈ నెల 18 నుంచి పీజీ తరగతులను పునఃప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే వర్సిటీకి రిజిస్ట్రార్ ఎవరో తేలక పోవడం, ప్రిన్సిపాల్ సెలవులో ఉండటంతో తరగతులు ప్రారంభించిన విషయాన్ని విద్యార్థులకు చేరవేసే వారే కరువయ్యారు. 17న అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి 18 నుంచి తరగతులు ప్రారంభించాలని ఆదేశించిన వీసీ అదే రోజు హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఇటు వీసీ, అటు రిజిస్ట్రార్ అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా మారింది. వాస్తవానికి ఈ నెల 30వరకు వేసవి సెలవులు ఉండటంతో అధ్యాపకులు, విద్యార్థులు తమ స్వగ్రామాలకు వెళ్లిపోయారు. ఇతర యూనివర్సిటీల్లోనూ జూన్ మొదటి వారం వరకు వేసవి సెలవులు ప్రకటించారు. తెయూలో వీసీ వర్సెస్ ఈసీ వివాదం కొనసాగుతుండటంతో ఇష్యూను పక్కదారి పట్టించేందుకే వీసీ ఇలా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నూతన విద్యాసంవత్సరాన్ని ముందస్తుగా ప్రారంభించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు అధ్యాపకులు ఇంకా సెలవులోనే ఉన్నారు. ఉన్న కొద్దిమంది అధ్యాపకులు అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు. సమాచారం లేకపోవడంతో రెండోరోజూ విద్యార్థులెవరూ తరగతులకు హాజరు కాలేదు.

సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న శ్రీనివాస్

సుభాష్‌నగర్: జిల్లాలోని సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఏటీఎస్ శ్రీనివాస్ కోరారు. ఈమేరకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సుమారు గంటన్నరపాటు సమస్యలపై డీపీవో జయసుధతో కలిసి మాట్లాడారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తానని కలెక్టర్ హామీనిచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం



ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం ఒక చోటు కలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, రాజయ్య, గోదావరి, రాజేశ్వర్, జ్ఞానేశ్వర్, విద్యార్థులు నగేష్, శేఖర్, రఘు, భాను, వినయ్, ఉమారాణి, సుమలత పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

నిజామాబాద్ సిటీ: టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఏఆర్‌టీ సెంటర్‌లో 40 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను డీఎంహెచ్‌వో సుదర్శనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ పౌష్టికార లోపంతో వచ్చే అవకాశం ఉంటుందని, ఇలాంటి అభాగ్యులకు అండగా ఆత్మీయ భరోసా ఇవ్వడానికి ముందుకు వచ్చిన సూర్య హెల్త్ ఆర్గనైజేషన్‌ను డీఎంహెచ్ఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో సూర్య హెల్త్ ఆర్గనేజేషన్ రాజేందర్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, డాక్టర్ సంతోష్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవిగౌడ్, డీపీఎం సుధాకర్, మహేందర్, హరీశ్, వినోద్, సన్నీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పరిశీలన

సిరికొండ: మండల కేంద్రంలో మరమ్మతులు జరుగుతున్న పీహెచ్‌సీ భవనాన్ని డీఎంహెచ్‌వో సుదర్శనం శుక్రవారం పరిశీలించారు. ఆధునికీకరణ పనుల్లో ఇంకా చేయాల్సిన పనులను త్వరగా పూర్తి చేయించి భవనంలో వైద్య సేవలను ప్రారంభించాలని ఆదేశించారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. డీపీవో విశాలరాణి, హెచ్‌డబ్ల్యూసీ జిల్లా కోఆర్డినేటర్ గోవర్ధన్, మెడికల్ ఆఫీసర్ అరవింద్ ఉన్నారు.

యువతి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాలనీలో నివాసం ఉండే వొల్లెల ఆనంద్ వంట మనిషిగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె అక్షయ (17)ఇటీవలే ఇంటర్ పూర్తి చేసింది. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు. తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని తండ్రి ఆనంద్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్ఓ నరేష్ తెలిపారు.

క్రైం కార్నర్

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

తాడ్వాయి: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండలంలోని పల్లెగడ్డా తండాకు చెందిన రాజునాయక్ గురువారం మద్యం తాగి బైక్ నడుపుతూ పోలీసులకు దొరికాడు. శుక్రవారం రాజ్‌నాయక్‌ను కోర్టులో హాజరు పరచగా కామారెడ్డి ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ నాలుగు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

భిక్కనూరు: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి కామారెడ్డి సెకండ్ క్లాస్ మేజిస్రేట్ ప్రతాప్ నాలుగు రోజుల జైలు శిక్షతో పాటు రూ.200 చొప్పున జరిమానా విధించినట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు. భిక్కనూరు పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కామారెడ్డి పట్టణానికి చెందిన జునత్ పాషా, తిప్పాపూర్ గ్రామానికి చెందిన నరేశ్‌రెడ్డి మద్యం తాగి వాహనాలను నడిపిస్తూ పట్టుబడ్డరన్నారు. వీరిని అరెస్టు చేసి కామారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి నాలుగు రోజుల జైలుశిక్షతో పాటు జరిమానా విధించారని చెప్పారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

సిరికొండ: ఖతార్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని తాళ్లరామడుగు గ్రామానికి చెందిన సద్దాం(24) మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు చొరవతో మృతదేహం త్వరగా స్వగ్రామానికి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



భిక్కనూరు: భిక్కనూరులో తప్పిపోయిన బాలుడిని వారి తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన శుక్రవారం జరిగింది. వివరాలు.. మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన పోచమ్మల పద్మ–సత్తయ్య తమ కుమారుడు సాయి వినయ్‌తో కలిసి భిక్కనూరు తహసీల్ కార్యాలయంలో ఉన్న ఆధార్ కేంద్రానికి వచ్చారు. సాయి వినయ్ కార్డును అప్‌డేట్ చేసేందుకు తల్లిదండ్రులు లైన్‌లో నిల్చున్నారు. సాయి వినయ్ అక్కడి నుంచి కనిపించకుండా పోయాడు. ఎంత వెతికినా బాలుడి ఆచూకీ దొరకలేదు. సాయి వినయ్ జంగంపల్లి శివారులో ఉన్న విషయాన్ని వీఆర్‌ఏల ద్వారా తెలుసుకున్న తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ ఆ బాలుడిని భిక్కనూరుకు రప్పించి తల్లిదండ్రులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు



గాయపడ్డ నరేందర్

మోపాల్: మండలంలోని తాడెం శివారులో శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని నగరంలోని ఆనంద్‌నగర్‌కు చెందిన నరేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరేందర్ శుభకార్యాలకు వంటలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మోపాల్‌లో శుభకార్యం నిమిత్తం వంట సామగ్రి జాబితా ఇచ్చేందుకు వెళ్తున్నాడు. తాడెం శివారులో వెనక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో నరేందర్ కాలు విరిగింది. వెంటనే 108లో జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి..

పిట్లం(జుక్కల్): మండలంలోని చిన్నకొడప్‌గల్ సమీపంలోని ధర్మారం టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలయ్యాయి. పెద్దకొడప్‌గల్‌కు చెందిన ప్రేమ్ కుమార్ పిట్లం వెళ్తుండగా చిన్నకొడప్‌గల్ సమీపంలోని టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. ప్రమాదంలో ప్రేమ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతనిని హైవే సిబ్బంది చికిత్స నిమిత్తం పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తీసుకెళ్లారు.

సీతాయిపల్లిలో గుడిసె దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన గుడిసె



కాలిపోతున్న గడ్డి వాము

గాంధారి: మండలంలోని సీతాయిపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు నివాసపు గుడిసె కాలిపోయి, రూ.1.25 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు గిర్దావర్ నరసింహారెడ్డి తెలిపారు. కన్నెబోయిన భాగ్యకు చెందిన గుడిసె పూర్తిగా కాలిపోయింది. ఘటన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. నెల క్రితం ఇదే గుడిసె పాక్షికంగా కాలిపోవడంతో బాధితులు కాలనీలో వేరే ఇంట్లో ఉంటున్నారని గిర్దావర్ తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ ఆదేశాల మేరకు జెడ్పీటీసీ శంకర్‌నాయక్, బలరామ్‌నాయక్ పలువురు ప్రజా ప్రతినిధులు ఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులకు రూ.12 వేల నగదు, 25 కిలోల బియ్యం అందజేశారు.

లింగంపల్లి(ఖుర్దు)లో గడ్డివాము..

లింగంపేట: మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామానికి చెందిన గాలెం మల్లేశం గడ్డివాము శుక్రవారం దగ్ధమైనట్లు సర్పంచ్ రాజయ్య తెలిపారు. మల్లేశం రెండు ఎకరాల భూమిలో వరి పంట నూర్పిళ్లు చేసి గడ్డి మోపులు కట్టి వాముగా పంట చేనులో పేర్చుకున్నాడు. గడ్డివాముకు విద్యుత్ తీగలు తగిలి ప్రమాదవశాత్తు కాలిపోయాయి. ఎల్లారెడ్డి అగ్నిమాపక శకటం ప్రమాద స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేసింది. రూ.15 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

ఇసన్నపల్లిలో గుడిసెకు నిప్పు

రామారెడ్డి: మండలంలోని ఇసన్నపల్లిలో పశువుల కొట్టానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి కొట్టం శుక్రవారం రాత్రి కాలిపోయింది. ఎవరో కావాలనే నిప్పు పెట్టినట్లు లక్ష్మారెడ్డి ఆరోపించారు. కొట్టంలో ఉన్న దూడ చనిపోయింది. పశువులను బయట కట్టేయడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి.

లారీని ఢీకొన్న డీసీఎం



భిక్కనూరు: భిక్కనూరు మండలం ఎడ్ల కట్ట వాగు వద్ద జాతీయ రహదారిపై వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు ఎల్లిగడ్డల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రమాదంలో ఎల్లిగడ్డల లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.